క్లుప్తంగా

శ్రీనివాస కల్యాణానికి ఏర్పాట్లు

ఆదోని అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి సేవకుల సహకారంతో ఆదివారం శ్రీనివాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కాషాయ జెండాలను ఏర్పాటు చేశారు. అలాగే మున్సిపల్ క్రీడా మైదానంలో భక్తులు కూర్చునేందుకు ఏర్పాట్లు, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు వేదిక తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్రీ మంగళ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మున్సిపల్ క్రీడా మైదానం వరకు భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

స్నేహితుల ఔదార్యం


స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన మాల దాసరి చిన్న వీరేష్ (35) అనే యువరైతు పిడుగు పాటుకు గురై మృతి చెందిన సంఘటన విధితమే. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు (2004 సంవత్సరం పదో తరగతి బ్యాచ్) ఒకరికొకరు చేయి కలిపి విరాళాలు సేకరించి శుక్రవారం మృతుడి భార్య రత్నమ్మకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. స్నేహితుడు అకాలమరణం చెందడం పట్ల సంతాపం ప్రకటించారు.

ఆలయ ఉద్యోగుల బదిలీ

కౌతాళం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు వివిధ దేవాలయాలకు బదిలీ అయినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు పైబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వారికి దేవదాయ శాఖ బదిలీలు చేపట్టగా ఉరుకుంద ఆలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును అనంతపురం జిల్లా కదిరికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కుమార్‌ను నంద్యాల జిల్లా యాగంటికి, వీరేష్‌ను డోన్ దగ్గరలోని రాచర్లకు బదిలీ చేసినట్లు ఆమె తెలిపారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత


చికిత్స పొందుతున్న వినోద్‌కుమార్

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్‌ను శుక్రవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు అతన్ని వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కుమా ర్ శుక్రవారం ఇంట్లో ఉండగా పాముకాటుకు గురైనట్లు అతని తమ్ముడు రవి తెలిపాడు.

ఏపీ ఎస్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగరాజు

ఆదోని అర్బన్: విజయవాడలో జరిగిన ఎస్సీ ఉప కులాల సమావేశంలో పట్టణానికి చెందిన నాగరాజు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ 57 ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడలో జరిగిన ఎస్సీ ఉప కులాల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేష్ మోదీ తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఏపీ ఎస్సీ జాబితాలో ఉన్న కులాలకు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డ హక్కులు నేటికీ అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్న అన్ని కులాల వారికి ధ్రువీకరణ పత్రాలు, సేఫ్టీ నిధులు అందేవిధంగా పోరాటం చేస్తామని తెలిపారు.

తాయమ్మవ్వ ఆలయం ప్రారంభం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రాయచోటి సుబ్బయ్య కాలనీలో నూతనంగా నిర్మించిన తాయమ్మవ్వ దేవాలయను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు దేవాలయం అవరణలో హోమం, అమ్మవారికి పంచామృతం, అభిషేకం, మహామంగళ హారతి, ఆకుపూజలను చేశారు. అనంతరం తాయమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యల్లప్ప, ఉరుకుంద, చిన్నసంపత్, నరేంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: మండలంలోని హువ్వనూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని జనసేన మండలం నాయకులు తహేర్ వలి, పులిరాజు శుక్రవారం డిమాండ్ చేశారు. గ్రామస్తులు సాదాపురం పంప్‌హౌస్ వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

సంపూర్ణ పోషణ.. మెరుగైన ఆరోగ్యం

- మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- సంపూర్ణ పోషణకు ప్రభుత్వం పెద్దపీట



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న దృశ్యం (ఫైల్), పిల్లల ఎదుగుదల వివరాలు నమోదుచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆదోని రూరల్: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. పిల్లలు, తల్లులకు సరైన పోషణ అందించడంతో పాటు పిల్లలు ఆసక్తిగా ఆడుతూ, పాడుతూ ఓనమాలు నేర్చుకునేలా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో పనిచేస్తోంది. అందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలను ప్రవేశపెట్టింది. తల్లులు ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యకర శిశువుకు జన్మనివ్వడం, తల్లీబిడ్డ క్షేమంగా ఉండడం, పిల్లల ఎదుగుదల సరైన క్రమంలో ఉంచడం, పోషకాహార లోపం నివారణ, తల్లిలో రక్తహీనత లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణపోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలను తీసుకొచ్చారు.

పథకం ముఖ్య ఉద్దేశం

ఆరు నుంచి 72 నెలల పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత తగ్గించి, తక్కువ బరువుతో పిల్లలు పుట్టకుండా చర్యలు తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లల శాతాన్ని పెంచడం వంటి చర్యలు చేపడుతున్నారు.

అంగన్‌వాడీ భోజన మెనూ

ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర, పాలు, మంగళవారం అన్నం, టమాట పప్పు, కోడిగుడ్డు కూర, పాలు, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డ కూర, పాలు, గురువారం ఎగ్ ఫ్రైడ్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, పాలు, శుక్రవారం అన్నం, బీరకాయ లేదా సోరకాయ పప్పు, మునగాకు లేదా గుడ్డు కూర, పాలు, శనివారం వెజిటేబుల్ రైస్, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు, పాలు అందిస్తారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందించే సరుకులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు రోజుకు 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల నూనె, 200 మి.లీ. పాలు, గుడ్డు, 15 గ్రాముల ఆకుకూరలు, 75 గ్రాముల కూరగాయలు, 35 గ్రాముల మునగాకుపొడి అందిస్తారు. చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, నూనె, పాలు, రోజుకో గుడ్డు, 50 గ్రాముల ఆకుకూరలు, 26 గ్రాముల కూరగాయలు, మూడు గ్రాముల శనగాకుపొడి, 20 గ్రాముల శనగలు అందిస్తారు.

గర్భిణులు, బాలింతలకు ఇంటికిచ్చే సరుకులు ఇవే

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం రోజుకి 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల నూనె, 200 మి.లీ పాలు, గుడ్డు, 150 గ్రాముల ఆకుకూరలు, 75 గ్రాముల కూరగాయలు, 33 గ్రాముల మునగాకుపొడి అందిస్తారు. అలాగే 36 నెలల నుంచి 70 నెలల్లోపు పిల్లలకు రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనె, వంద మి.లీ పాలు, గుడ్డు, 50 గ్రాముల ఆకుకూరలు, 26 గ్రాముల కూరగాయలు, 3 గ్రాముల మునగాకుపొడి, 20 గ్రాముల శనగలు అలాగే కేజీ రాగి పిండి, చిక్కీలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండుఖర్జూర, ఒక కేజీ సజ్జ పిండి, కేజీ అటుకులు అందిస్తున్నారు. 6 నెలల నుంచి 36 నెలల్లోపు పిల్లలకు బాలామృతం 2.5 కేజీలు, గుడ్లు, 2.5 లీటర్ల పాలను అందిస్తున్నారు.

ఆదోని మండలంలో..

ఆదోని మండలంలో 97 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఆరు నెలల్లోపు పిల్లలు 1347 మంది, 6 నెలల నుంచి సంవత్సరంలోపు పిల్లలు 1,528 మంది ఉన్నారు. ఏడాది నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 4,598 మంది, 3–6 సంవత్సరాలోపు పిల్లలు 5,082 మంది ఉన్నారు. అలాగే గర్భిణులు 1,417 మంది ఉండగా బాలింతలు 1,343 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా బాలామృతం, పౌష్టికాహారం అందిస్తున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం సంపూర్ణ పోషణ పథకం ప్లస్, సంపూర్ణ పోషణ పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బాలామృతం, చిక్కీలు, రాగి పిండి, గుడ్లు, పాలు, మంచి పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నాం. వీటి ద్వారా రక్తహీనత తగ్గుతుంది.

– నిర్మలాదేవి, ఆదోని రూరల్ ఇన్‌చార్జి సీడీపీఓ

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన హనుమంతు అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శుక్రవారం ఉదయం కోసిగి రంగప్ప ప్రాంతం సమీపం నుంచి కుటుంబ సభ్యులకు వీడియోకాల్ చేసి తాను చనిపోతానని చెప్పి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆ ప్రాంతానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న హనుమంతును వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. హనుమంతు కౌతాళం మండలం మల్లనహట్టి గ్రామంలో అవ్వతాతల వద్ద ఉంటున్నాడు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ కోసిగిలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీధి కుక్కల తరలింపు

కోసిగి: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో విచ్చలవిడిగా సంచరిస్తూ వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని ఫారెస్ట్ ప్రాంతలో వదిలేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కోసిగిలో వైఎస్సార్ సర్కిల్ నుంచి బస్టాండ్, గాంధీనగర్, మార్కండేయ స్వామి ఆలయం వరకు రోడ్లపై ఉన్న వీధి కుక్కలను పట్టుకుని ట్రాక్టర్లలో వేసుకుని తరలించారు. రోడ్లపై వెళ్లే వాహనదారులు, ప్రజలను కుక్కలు కరవడంతో పాటు ప్రమాదాలకు గురి చేస్తున్నాయన్నారు. మొదటిరోజు 50 కుక్కలను తరలించగా, మరో మూడు రోజుల పాటు గ్రామంలోని అన్నీ వీధి కుక్కలను పట్టి మరో ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. పెంపుడు కుక్కలకు యజమానులు మెడలో ఎదో ఒకటి గుర్తుగా పెట్టాలని సూచించారు.

ఆదోని యార్డు సెక్రటరీగా రామ్మోహన్ రెడ్డి


ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నూతన సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి కడప డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. రామ్మోహన్‌రెడ్డి అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా పనిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదోనికి బదిలీ అయ్యారు. ఈయన గతంలో 2010 నుంచి 2012 వరకు ఆదోనిలో పనిచేశారు. అక్కడినుంచి అనంతపురం, గుంటూరు, శ్రీకాళహస్తి, అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులలో సేవలందించారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడుపుతానని, రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతులకు సమస్య వస్తే నేరుగా తనను సంప్రదించవచ్చని సూచించారు. అలాగే యార్డులో సమస్యలు తలెత్తితే వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన సెక్రటరీ

వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రామ్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలమాలలు, శాలువా వేసి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు సమస్యలు లేకుండా యార్డును అభివృద్ధి పథంలో నడపాలని ఎమ్మెల్యే సూచించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, నరసింహమూర్తి, యార్డు సిబ్బంది నరసరెడ్డి తదితరులు ఉన్నారు.

చోరీలపై అప్రమత్తం


కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు, దిశా పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణవాసులు ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శివనారాయణ స్వామి సూచించారు. చోరీల నివారణకు జాగ్రత్తలను సూచిస్తూ గురువారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కర పత్రాలను విడుదల చేశారు. ఆయనతో పాటు సీఐలు విక్రమసింహ, శ్రీనివాసనాయక్, నరసింహరాజు, ఎస్ఐ పీరయ్య, దిశా మహిళా పోలీసులు పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఇతర ఊర్లకు వెళ్లేవారు విలువైన బంగారం, నగదును సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని, లేదా బంధువుల వద్ద ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఆభరణాలకు మెరుగు పెడతామని వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్కువ ధరకు బంగారం, వెండి నగలను అమ్ముతామని చెప్పే వారిని నమ్మవద్దన్నారు. అలాంటి వారు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఆధార్, బ్యాంకు ఖాతా, పాన్ కార్డు వివరాలను ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు ఇవ్వరాదని, సెల్‌ఫోన్‌లో ఓటీపీ నంబర్ల గురించి ఎవరైనా అడిగితే చెప్పవద్దని, కాలనీలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే 1930కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి జోలికెళ్లి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోండి

మంత్రాలయం: ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ తహసీల్దార్ చంద్రశేఖర్, మాధవరం ఎస్ఐ కిరణ్‌కు సూచించారు. రచ్చుమర్రి, మాధవరం గ్రామాలకు చెందిన పలువురు ఫిర్యాదు చేయడానికి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌కు వెళితే అసభ్యకరంగా మాట్లాడుతున్నారని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధిక వడ్డీలకు అప్పు ఇచ్చి ఆస్తులను లాక్కుంటున్నాడని, మహిళలను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సీతరామయ్యను ఆదేశించారు. సీఐ శ్రీనివాసులు ఉన్నారు.

కురువల అభివృద్ధికి కృషి


కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: కురువల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. కౌతాళంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కురువల కులదైవం కనకదాస విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం ఎంపీపీ అమరేష్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలన్నదే తమ ధ్యేయం అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 5 ఎత్తిపోతల పథకాలకు రూ.70 కోట్లతో పనులు ప్రారంభించామని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అందరూ కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కనకదాస విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించి ఇచ్చిన ఎమ్మెల్యేకు ఎంపీపీ అమరేష్, కురవ సంఘం మండలాధ్యక్షుడు లింగన్న తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు, కురవ కులస్తులు పాల్గొన్నారు.

పాడిపశువులపై మృత్యు పాశం


విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు, ఆవులు

కోసిగి: మండల పరిధిలోని కడదొడ్డి గ్రామ పొలాల వెంట మేతకు వెళ్లిన వెళ్లిన 4 గేదెలు, 3 ఆవులు విద్యుత్ తీగలు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాయి. గురువారం సాయంత్రం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు కిందకు వాలాయి. అయితే శుక్రవారం వ్యవసాయానికి యథావిధిగా విద్యుత్ సరఫరా ఇవ్వడంతో గమనించని పశువుల కాపరులు ఆవులు, గేదెలు మేతకు తీసుకెళ్లారు. మేత మేస్తుండగా పశువులు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందాయి. కడదొడ్డి గ్రామానికి చెందిన బొంపల్లి ఉసేనికి చెందిన 2 గేదెలు, 2 ఆవులు, బొంపల్లి తిక్కయ్యకు చెందిన ఆవు, బొంపల్లి నరసయ్యకు చెందిన 2 గేదెలు మృతి చెందినట్లు బాధితులు వాపోయారు. మూగజీవాల మృతికి కారణమైన విద్యుత్ అధికారులు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈదురు గాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుంటే సమాచారం ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ కోరారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి ఉరుసు


పూలతో అలంకరించిన ఖాదర్‌లింగ స్వామి సమాధి


దర్గాలో భక్తుల కోలాహలం


దర్గాలో స్వామికి పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కౌతాళం దర్గాలో జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 319వ ఉరుసు మహోత్సవం శుక్రవారం కనులపండుగగా జరిగింది. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఏటా మాదిరిగానే తెల్లవారుజామున 3 గంటల నుంచి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తి ఇంటి నుంచి గంధం బయలుదేరి డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాల మధ్య దర్గాకు చేరింది. ఈ సందర్భంగా పక్కీర్లు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గంధం దర్గాకు చేరిన అనంతరం ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. గంధను దర్గా పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీ, ధర్మకర్త స్వామి వారి సమాధికి ఎక్కించడంతో ఉరుసు కార్యక్రమాలు ఘనంగా కొనసాగినట్లు ప్రతీక. ఉత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, మధ్యప్రదేశ్, తమిళనాడు, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లక్షకు పైగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మకర్త ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రద్దీ తగ్గలేదు. దర్శనం కోసం భక్తులు గంటకుపైగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఎర్పడింది. భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దర్గా అభివృద్ధికి కృషి

కౌతాళం: ఖాదర్‌లింగ స్వామి దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం దర్గాకు తరలివచ్చి ప్రత్యేకంగా తెచ్చిన చాదర్, పూలను సమర్పించారు. ఎమ్మెల్యేకు ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ స్వాగతం పలికి దర్గా సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాదర్‌లింగ స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు కృష్ణంరాజు, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, సర్పంచ్ పాల్‌దినకర్, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్ పలువురు వెంట ఉన్నారు. అలాగే రాయలసీమ కో–ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలూరు ఇన్‌చార్జ్ రామకృష్ణ, టీడీపీ నాయకుడు ఉలిగయ్య, చెన్నబసప్ప, దివాకర్‌రెడ్డి తదితరులు దర్గాలో పూజలు నిర్వహించారు.

గంధం ఉత్సవానికి తరలివచ్చిన దర్గా పీఠాధిపతులు

గంధం ఉత్సవానికి వివిధ దర్గాల పీఠాధిపతులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. బీదర్ దర్గాకు చెందిన అబుల్ ఫయాజ్, హుబ్బళ్లి దర్గా పీఠాధిపతి సయ్యద్ ముద్దసీర్, సింధనూర్ దర్గా పీఠాధిపతులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌బాషా, సయ్యద్ ఖాలిద్‌బాబా, మగ్దుమ్‌ఖాద్రి దర్గా పీఠాదిపతి షాఅలి ఖాద్రి పలువురు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మంత్రాలయం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మంత్రాలయం ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలడోణ గ్రామానికి చెందిన హనుమంతు పెద్దతుంబళంకు వెళ్తుండగా చెట్నేహళ్లి గ్రామ శివారులో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో హనుమంతు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన వాహనదారులు చికిత్స నిమిత్తం 108 ద్వారా ఎమ్మిగనూరుకు తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 80 – 100 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అవకాశం ఉంది. అన్ని సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు ఉన్నారు. ఇంగ్లిష్‌కు ఒకరు రెగ్యులర్ కాగా, 10 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు.

శరవేగంగా నాడు–నేడు పనులు

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రూ.20.84 లక్షలతో నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళాశాలలో మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. అయా పనుల కోసం ఇప్పటివరకు రూ. 14.81 లక్షలు ఖర్చు చేశారు. ప్లంబింగ్, పెయింట్, తాగునీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్, కళాశాలలో మరమ్మతు పనులు చేస్తున్నారు.

అందుబాటులో అన్ని సౌకర్యాలు

కళాశాలలో విదార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మంచి ల్యాబ్‌లతో పాటు నాణ్యమైన విద్యను అందించే అధ్యాపకులు ఉన్నారు. నాడు–నేడు ద్వారా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి చేరే బాలికల కోసం ప్రభుత్వ హాస్టళ్లు కూడా ఉన్నాయి.

– వి.సంజన్న, కళాశాల ప్రిన్స్‌పాల్

ఆర్థిక సాయం అందజేత

కోసిగి: వందగల్లు గ్రామంలో మాలదాసరి చిన్న వీరేష్, పెద్ద భూంపల్లిలో చిన్న నరసింహులు అనే విద్యార్థి పొలాల్లో పిడుగు పాటుకు గురై మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే తరపున శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఆయా గ్రామాలకు చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి పరిహారం త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: డివిజన్ పరిధిలో 7,500 మంది విదార్థులు పది సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు 34 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ డీఈఓ యు.జె.సుకుమార్ శుక్రవారం తెలిపారు.ఆదోని పట్టణంలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో 669 మందికిగాను 164 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కోసిగి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు స్థానిక బాలుర పాఠశాలలో 117 మందికి గానూ 26 మంది, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 118 మందికి గానూ 29 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ శోభరాణి తెలిపారు.